
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.9 కనిష్ఠం 25.2
కామారెడ్డి జిల్లా వార్తలు
5
శనివారం 8 జూన్ 2024



బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి


రామారెడ్డి, జూన్ 7: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు బాలయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు ఇసన్నపల్లి, మద్దికుంట, రెడ్డిపేట,అన్నారం, స్కూల్‌తండా, అన్నారం తండా తదితర గ్రామాల్లో బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇసన్నపల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల వివరాలను తీసుకుని వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా కృషిచేస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని వివరించారు.

- కోడ్ కారణంగా మూడు నెలలపాటు సంక్షేమం కోసం నిరీక్షణ
- తొలగిన ఎన్నికల కోడ్
- ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ అందక లబ్ధిదారుల ఇబ్బందులు
- రైతుబంధు ఇస్తారా.. లేక రైతు భరోసానా?
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపులు
- అభివృద్ధి పనుల్లో వేగం పెరిగేనా ?
- ఎన్నికల కోడ్ తొలగిపోవడంతో సంక్షేమం అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి

సంక్షేమ పథకాలపైనే ఆశలు!







కామారెడ్డి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్‌ను ఎన్నికల కమిషన్ ఎత్తివేసినందున అభివృద్ధి, సంక్షేమ పథకాలపై జిల్లాప్రజల ఆశలు నెలకొంటున్నాయి. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు అడ్డుగా మారిన ఎన్నికలకోడ్ ముగిసింది. మూడు నెలలుగా కోడ్ అమలులో ఉండడంతో కొత్తగా చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఎంపిక ఇప్పటివరకు అమలవుతున్న పథకాలకు సంబంధించిన మార్పులు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. కోడ్ ముగియడంతో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ఆశలు పెట్టుకున్న ప్రజలు అవిమేర తమకు దక్కుతాయోనని ఎదురుచూస్తున్నారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం గత మార్చి 8న విడుదల చేసింది. అదేరోజు నుంచి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ పరంగా కొత్తగా అభివృద్ధి పనులు చేపట్టడానికి, కొత్తగా సంక్షేమ పథకాలను అమలులోకి తీసుకురావడానికి అవకాశం లేకుండా పోయింది.

ముగిసిన ఎన్నికల కోడ్

పార్లమెంట్ ఎన్నికలకు దేశవ్యాప్తంగా కేంద్ర ఎన్నికల సంఘం ఏడు విడుతలలో నిర్వహించారు. జూన్ 4న ఎన్నికలకౌంటింగ్ నిర్వహించారు. రెండ్రోజుల క్రితం ఎన్నికల కోడ్ ముగిసింది. శుక్రవారం నుంచి ఆయా ప్రభుత్వాలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టేందుకు గ్రీన్‌సిగ్నల్ లభించినట్లయింది. ఆరునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ తాము గెలిస్తే ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల్లో మెజార్టీ సీట్లు సాధించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి మరో 11మంది మంత్రులతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశారు. అప్పటినుంచి ఎన్నికల సందర్భంగా హామీఇచ్చిన గ్యారెంటీ పథకాల అమలుపై దృష్టిసారించారు. ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్ లాంటి పథకాలను అమలుచేస్తూ వచ్చారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ రావడంతో గృహజ్యోతి, సబ్సిడీగ్యాస్ పథకాలు మధ్యలోనే నిలిచిపోయాయి. కొందరికి ఆ పథకాలు లబ్ధిచేకూరాయి.

వారం రోజుల్లోనే కోడ్ అమలు

ఉచిత విద్యుత్, సబ్సిడీ సిలిండర్ పథకాలను అమలులోకి తీసుకువచ్చిన వారంరోజుల్లోనే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. ఉచిత విద్యుత్ అమలుకు నోచుకొని కుటుంబాల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. అలాగే ఒక ఇంట్లో రెండు మీటర్లు ఉంటే రెండు మీటర్ల నంబర్లను దరఖాస్తుల్లో పేర్కొనడంతో విద్యుత్ సిబ్బంది యాప్‌లో రెండింటిని నమోదుచేశారు. ఆయా మీటర్లలో ఏదైతే తక్కువ బిల్లు వస్తుందో దానికి ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తింపజేశారు. అంతకంటే కాస్త ఎక్కువ బిల్లు వచ్చే మీటర్‌కు ఈ పథకాన్ని వర్తింపచేసేందుకు ఎడిట్ ఆప్షన్ కోడ్ వల్ల ఇవ్వలేదు. అలాగే చాలామంది సబ్సిడీ గ్యాస్ డబ్బులు ఇప్పటివరకు పడడం లేదు. ఈ విషయమై గ్యాస్ ఏజెన్సీల వద్దకు వెళ్లి చెక్‌చేసుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. వీటిని పరిష్కరించేందుకు ఎన్నికల కోడ్ ఎప్పుడు ఎత్తివేస్తారని ఎదురుచూశారు. అలాగే గత ప్రభుత్వం అమలు చేసిన విధంగా రైతుబంధు ద్వారా యాసంగి సాగు రైతుల ఖాతాలో పెట్టుబడి సాయాన్ని జమచేసింది. వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.7500, కౌలు రైతుకు, రైతు కూలీలకు ఏడాదికి రూ.12వేల చొప్పున అందజేస్తుందా లేక పాత పథకాన్ని కొనసాగిస్తుందో తెలియడం లేదు. ఎన్నికల కోడ్ వల్ల పథకం గురించి ఎక్కడ కూడా మంత్రులు ప్రకటన చేయలేదు.

గృహజ్యోతి అందరికీ అమలయ్యేనా?

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఉచిత బస్సును పూర్తిస్థాయిలో మహిళలకు అమలులోకి తీసుకొచ్చింది. దీంతోపాటు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అప్పటివరకు రూ.5లక్షల అందిస్తున్న ఉచిత వైద్యాన్ని 10లక్షలకు పెంచి ఆ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చింది. ఆ తర్వాత మార్చ్ మొదటి వారంలో గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే పథకంతో రూ.500 సబ్సిడీ గ్యాస్ అందించే పథకాన్ని అమలులోకి తీసుకువచ్చారు. అయితే పార్లమెంట్ ఎన్నికలకోడ్ అమలులోకి రావడంతో ఈరెండు పథకాలు పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు చేరలేదు. చాలామందికి జీరోబిల్లు అర్హులుగా ఉన్నా అమలుకాకపోవడంతో దరఖాస్తు చేసుకునేందుకు లబ్ధిదారులు ప్రయత్నించగా కోడ్ అమలులోకి రావడంతో నిలిచిపోయింది.

ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేనా?

మార్చ్‌నెలలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఒక్కో నియోజకవర్గానికి రూ.3500 చొప్పున ఇళ్లను ప్రభుత్వం మంజూరుచేసింది. ఈ పథకం ద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. గత ప్రభుత్వ హయంలో డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టినప్పటికీ కొందరికి మాత్రమే అందాయి. చాలాచోట్ల డబుల్‌బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ పథకం ఫెయిల్ కావడంతో అనేక మంది పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఒక్కో లబ్ధిదారుడికి రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించింది. ఈ పథకం ద్వారా ఇప్పుడు లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రజలు ఎదురుచూస్తున్నారు. అలాగే అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10కోట్ల చొప్పున నిధులు మంజూరుచేసింది. ఈ నిధులకు సంబంధించి పనులు చేపట్టేందుకు ప్రణాళికను, ప్రతిపాదనను సిద్ధం చేసేలోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు ఆగిపోయాయి. పార్లమెంటు ఎన్నికలు ముగిసి ఫలితాలు సైతం వచ్చేయడంతో సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



- కలెక్టర్‌తో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మున్సిపల్‌లో పనులకు సహకరించాలి

కామారెడ్డిటౌన్, జూన్7: వర్షాకాలం నేపథ్యంలో మున్సిపల్‌లో పలు పనులకు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు, దోమల నివారణ చర్యలు తీసుకునేవిధంగా జిల్లాఅధికారి యంత్రాంగం సహకరించేలా చూడాలని కోరారు. పట్టణంలో తాగునీటి సమస్య, వీధిదీపాలు, పార్క్ అభివృద్ధి అంశాలను చర్చించడంపై కలెక్టర్‌కు సానుకులంగా స్పందించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్‌లు పాత శివకృష్ణమూర్తి, చాట్లావంశీ తదితరులు పాల్గొన్నారు.

నాయకుల ఇళ్లల్లో పనిచేయడం మానుకోవాలి: ఎమ్మెల్యే



వైద్యసిబ్బందితో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కామారెడ్డిటౌన్, జూన్7: మున్సిపల్ సిబ్బంది నాయకుల ఇళ్లలో పనిచేయడం మానుకోవాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి కార్మికులకు సూచించారు. శుక్రవారం తెల్లవారుజామునే మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల హాజరు పరిశీలించడంతోపాటు శానిటేషన్ కార్యాలయం, వాటర్‌వర్క్స్ వద్ద సిబ్బందితో మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ప్రజలు చెల్లించే పన్నులతో జీతాలు తీసుకుంటున్నారని అందుకు తగ్గట్టుగా పనులు చేయాలేతప్ప నాయకులు ఇళ్లలో పనిచేయడం వారు చెప్పినవిధంగా పనులు చేయడం తగదని అన్నారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల ప్రకారం పనులు చేయాలని తెలిపారు. నాయకులకు అనుకులంగా పనులుచేసే వారిని ఉపేక్షించేది లేదని ప్రజలకు మాత్రమే సేవకులుగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా నీటి ఎద్దడికి ఏం చేయాలనేదానిపై పలు సూచనలు చేయాలని సూచనలను పరిగణలోకి తీసుకుని పరిశీలనచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ సుజాత, మున్సిపల్ అధికారులు ఉన్నారు.

• కామారెడ్డిని రాష్ట్రంలోనే తొలిస్థానంలో ఉంచాలి

కామారెడ్డిని రాష్ట్రంలోనే అభివృద్ధిలో మొదటిస్థానంలో ఉంచేలా అధికారులు కృషిచేయాలని ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపుకార్యాలయంలో మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం చూపాలనిఅన్నారు. కార్యాలయానికి సమస్యపై వచ్చే ప్రజలకు తగినవిధంగా స్పందించి న్యాయం చేయాలని సూచించారు. వైద్యులు దేవుళ్లతో సమానమని రోగులకు తగిన సౌకర్యాలు అందేలా చూడాలని కోరారు. వైద్యులు సమయపాలన పాటించాలని ఇష్టారీతిన రావడం మానుకోవాలని సూచించారు. రోగులకు అసౌకర్యం కలిగిన చూస్తూ ఊరుకునే ప్రసక్తేలేదని తన వద్ద కు ఏ ఫిర్యాదు వచ్చిన చర్యలు తీసుకునేలా పైఅధికారు లకు సిఫారస్సు చేస్తానన్నారు. కార్యక్రమంలో డీయంహెచ్‌వో చంద్రశేఖర్, డీసీహెచ్ఎస్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.



నీటిపారుదల శాఖ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కలెక్టర్



- మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- మాట్లాడుతున్న జడ్పీ వైస్‌చైర్మన్



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

- పలు విభాగాల పనితీరుపై జడ్పీటీసీ, ఎంపీపీల ఏకరువు
- చెరువులోంచి రైతులు మట్టి తరలించకుండా నీటి పారుదల శాఖ అధికారులు అడ్డుకోవడంపై..
- క్యూబిక్‌మీటర్ చొప్పున డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారంటూ ప్రశ్నించిన ప్రజాప్రతినిధులు
- ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యపు సమాధానం.. నాయకుల ఆగ్రహం
- రైతులకు ఇబ్బందులు కల్గించవద్దన్న కలెక్టర్
- కలెక్టర్‌కు సైతం ఇరిగేషన్ అధికారుల నిర్లక్ష్యపు సమాధానం
- మండిపడ్డ జడ్పీ వైస్‌చైర్మన్, ఎంపీపీ, జడ్పీటీసీలు, కలెక్టర్
- నకిలీ విత్తనాలను నివారించాలి: ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జడ్పీ చివరి సమావేశం వాడీవేడిగా..

కామారెడ్డిటౌన్, జూన్7: ఎంపీపీ, జడ్పీటీసీల పదవీకాలం మరో నెలలో ముగిసిపోతుండడంతో ఐదేళ్లుగా ప్రజల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకువచ్చిన పరిష్కారం కాలేదంటూ ఏకరువు పెట్టారు. పలు విభాగాల అధికారుల పనితీరుపై జడ్పీటీసీ, ఎంపీపీలు అసహనం వ్యక్తం చేస్తూ నీటి పారుదల శాఖ అధికారుల పనితీరుపై కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో చివరి జడ్పీ సమావేశం వాడీవేడిగా సాగింది. శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో జడ్పీచైర్‌పర్సన్ దఫేదర్‌శోభ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ, వ్యవసాయశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, విద్యాశాఖ, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, మిషన్‌భగీరథ, నీటి పారుదలశాఖ, పౌరసరాఫరాల శాఖల చర్చించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి హాజరుకాగా, ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. మొదటగా వ్యవసాయశాఖజిల్లా అధికారి భాగ్యలక్ష్మీ ఆ శాఖ నివేదికను చదువుగా ఎంపీపీ, జడ్పీటీసీలు ఏఈవోల సంఖ్యపై ప్రశ్నించారు. బీర్కూర్‌లో నకిలీ విత్తనాల అమ్మకాలపై ఎందుకు అలసత్వం వహించారని దీంతో దాదాపు 100మంది వరకు రైతులు నష్టపోయారని అన్నారు. రైతులకు 40వేల వరకు నష్టం చేకురితే కేవలం 10 నుంచి 20వేల అందించడం ఏంటని ప్రశ్నించారు.దీంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ కలుగజేసుకుని వ్యవసాయ శాఖ అధికారులు తమ విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని నకిలీ విత్తనాలను అమ్మకాలు జరిపిన వారిపై పీడీ యాక్ట్ ఎందుకు నమోదుచేయలేదని జిల్లా వ్యవసాయాశాఖ అధికారిని ప్రశ్నించారు.దాటవేత ధోరణి మంచి పద్ధతి కాదని అన్నారు. పచ్చిరోట్ట విత్తనాలు జిల్లాకు 5200 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయని వ్యవసాయాధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని అవి ఏ మూలకు సరిపోతాయని అన్నారు. ఈ పాటికే రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందించాల్సిందని ఇప్పుడు అందిస్తే రైతులు ఎప్పుడు వాటిని వేసుకుంటారని అన్నారు.రైతులకు వరిపంట సన్నరకం మాత్రమే వేయాలని అప్పుడే రాష్ట్ర ప్రభుత్వం రూ.500ల బోనస్ అందిస్తుందని ఏఈవోలు తెలియజేసేలా చూడాలని రైతులకు అవగాహన లేక దొడ్డురకం వేస్తే నష్టపోవాల్సి వస్తుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖధికారి చంద్రశేఖర్ శాఖ నివేదికనుచదివి వినిపించగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆపరేషన్ల రేటు సాదారణ ప్రసవ రేటు కంటే ఎందుకు ఎక్కువగా వస్తుందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ తరహా ప్రసవాలు తగ్గించాలని సూచించారు. డబుల్‌బెడ్‌రూం ఇళ్లకు సంబంధించిన బిల్లులు త్వరగా చెల్లించేలా చూడాలని లేదంటే పెద్ద ఎత్తున నిరసనలు చేపడుతామని పోచారం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు తెలిపారు.

• రైతులకు చెరువులో మట్టి ఇవ్వడం లేదు..

పంటపొల్లాలోకి చెరువు మట్టిని తీసుకునే వెళ్లామంటే నీటిపారుదల శాఖధికారులు అడ్డుకుంటున్నారని, పైగాక్యూబిక్ మీటర్‌కు ఇంత అంటూ డబ్బులు వసూలు చేస్తున్నారని జడ్పీటీసీ, ఎంపీపీలు సమావేశం లేవనెత్తారు. దీంతో నీటిపారుదలశాఖధికారులు పొంతనలేని నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతోపాటు ఇతర శాఖలపై రుద్దే ప్రయత్నం చేశారు. దీంతో ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తంచేశారు. రైతులకు పంటపొలాల్లో వేసుకునే మట్టికి డబ్బులు ఏవిధంగా వసూలు చేస్తారని ప్రశ్నించడంతో కలెక్టర్ కలుగచేసుకుని తన దృష్టికి ఈ విషయం వచ్చిందని ఇరిగేషన్ అధికారులు వారి పనితీరును సరిచూసుకుని సమన్వయంతో పనిచేయాలని అన్నారు. దీంతో ఇరిగేషన్ అధికారులు కలెక్టర్‌కు ఎదురుసమాధానం చెప్పడంతో జడ్పీవైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్, పలువురు జడ్పీటీసీ, ఎంపీపీలు ఆ అధికారిపై ఆగ్రహంవ్యక్తం చేశారు. 'కలెక్టర్ చెప్పింది మీరు వింటారా.. మీ ఇష్టారీతిన వ్యవహరిస్తారా' ఆయనకే ఎదురుసమాధానం చెబుతున్నారంటూ అసహనం వ్యక్తం చేయడంతో కలెక్టర్ సైతం అధికారులు తమ పద్ధతి మార్చుకోవాలని రైతులకు ఉచితంగానే మట్టి తీసుకుపోయేలా చూడాలని అది ఎప్పటినుంచో ఉందని, మీరు కొత్త నిబంధనలు ఏమి తీసుకురావద్దని తెలిపారు.

• సదరం కోసం దివ్యాంగులు అవస్థలు..

సదరం సర్టిఫికెట్లు లేక దివ్యాంగులకు అవస్థలు పడుతున్నారని పలువురు జడ్పీటీసీ, ఎంపీపీలు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. సమస్యను గత ఐదేళ్లగా తాము చెప్తున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. అర్హులైనా తమకు సదరం సర్టిఫికెట్ రాక ఫించన్ రావడం లేదని ప్రజలు తమను నిలదీస్తున్నారని అన్నారు. కొందరు అనర్హులకు సదరం సర్టిఫికెట్ ఇవ్వడంతో వారు ఫించన్లు తీసుకుంటున్నారని కలెక్టర్ దృష్టికి జడ్పీటీసీ, ఎంపీపీలు తీసుకురావడంతో పాటు గ్రామాలలో సమావేశం ఏర్పాటుచేసి అలాంటి వారి సర్టిఫికేట్లను రద్దుచేయాలని కోరారు. దీంతో కలెక్టర్ త్వరలోనే గ్రామం యూనిట్‌గా తీసుకుని అనర్హుల ఏరివేతతో పాటుఅర్హులకు దక్కేలా చూస్తామని తెలిపారు.

• ఓ శాఖ చెట్లు పెడితే.. మరోశాఖ నరికేస్తోంది..

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి చందర్‌నాయక్ ఆ శాఖ నివేదికను చదివి వినిపించడంతో పాటు హరితహరంలో నాటిన మొక్కలను ముందుముందు చేపట్టబోయే పలు అంశాలను వివరించారు.దీంతో పలువురు జడ్పీటీసీ, ఎంపీపీలు ఓ శాఖ చెట్లు పెడితే మరోశాఖ వాటిని పూర్తిగా నరికేస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కలెక్టర్ కలుగజేసుకుని ఈ విషయం తన దృష్టికి వచ్చిందని విద్యుత్‌శాఖ అధికారులు కేవలం కొమ్మలను తొలగించాలని సర్దుచెప్పారు. ఇష్టారీతిన చెట్లను నరికివేస్తున్నవారిపై కేసులు నమోదుచేయాలని డీఆర్‌డీవోకు సూచించారు. అదేవిధంగా తాడ్వాయి ఎంపీపీ గురుకుల పాఠశాలలో సరైన భోజనం అందించడం లేదని పౌరసరాఫరాల శాఖ అధికారులు పంపిణీచేస్తున్న బియ్యాన్ని విద్యార్థులు తినలేకపోతున్నారని తెలిపారు. దీంతో కలెక్టర్ వారానికి ప్రతీ పాఠశాలలో స్థానిక తహసీల్దార్ భోజనం చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైస్‌మిల్లర్లు రైతుల పొట్టకొట్టే పనులు చేపడుతున్నారని ఏ గ్రేడ్ బియ్యాన్ని కూడా బీగ్రేడ్ బియ్యం మాదిరిగా చూస్తున్నారని ఇందులో పౌరసరాఫరాల శాఖ అధికారుల కుమ్మక్కైనట్లుగా కన్పిస్తోందని, రైతులను మోసం చేస్తే ఎవరికీ మంచిది కాదని, పద్ధతి మార్చుకోవాలని సూచించారు.సమావేశంలో జడ్పీ సీఈవో చందర్ నాయక్, జడ్పీ వైస్‌చైర్మన్ ప్రేమ్‌కుమార్, జిల్లా అధికారులు, జడ్పీటీసీ, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఐదేళ్లు సహకరించిన అధికారులకు కృతజ్ఞతలు

• శోభ, జడ్పీ చైర్‌పర్సన్, కామారెడ్డి

ప్రజాసమస్యలను తెలియజేయగానే ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ తమకు సహకరించిన అధికారులకు పాలకవర్గం తరఫున కృతజ్ఞతలు. గత ఐదేళ్ల నుంచి సభలు, సమావేశాలు సజావుగా నిర్వహించి ప్రజాసమస్యలు పరిష్కరించడంలో సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారుల పనితీరు మారవలేనిది.

ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతుల ఆందోళన

● ఎత్తొండ సొసైటీకి తాళం వేసిన రైతులు

కోటగిరి, జూన్ 7: గత రబీ సీజన్‌లో సహకార సంఘం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ డబ్బులు చెల్లించాలంటూ సహకార సంఘానికి తాళం వేయడం గమనార్హం. కోటగిరి మండలంలోని ఎత్తొండ సహకార సంఘానికి శుక్రవారం రైతులు తాళం వేశారు. సహకార సంఘం పరిధిలో సుమారు 120మంది రైతులు యాసంగి పంటను పండించి తమ ధాన్యాన్ని సహకార సంఘానికి విక్రయించారు. మూడు నెలలు కావస్తున్న ధాన్యం డబ్బులు చెల్లించకపోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 2కోట్ల రూపాయలు చెల్లించాల్సి ఉందని రైతులు తెలిపారు. డబ్బుల విషయంలో అటు పాలకవర్గం, ఇటు అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సహకార సంఘానికి తాళం వేసి రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. కోటగిరి తహసీల్దార్ సునీత ఘటన స్థలానికి చేరుకుని రైతులను సముదాయించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. విండో కార్యదర్శి సంతోష్ అందుబాటులో లేకపోవడంతో ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


ఎత్తొండ సహకార సంఘం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

అంగన్‌వాడీ, బడిబాట కార్యక్రమంపై అవగాహన

ఎడపల్లి, జూన్ 7: మండలంలోని జానకంపేట గ్రామంలో శుక్రవారం అంగన్‌వాడి బడిబాటపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ విజయ రాణి మాట్లాడుతూ.. 3 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వరకు ఉన్న పిల్లలను అంగన్ వాడా కేంద్రాలకు పంపాలని, అంగన్ వాడీ కేంద్రాలలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వరకు విద్యార్థులకు విద్యాబోధన అందించడం జరుగుతుందని అన్నారు. అంగన్‌వాడి కేంద్రాల్లో పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తూ వారికి ఆటలతో పాటు విద్యాబోధన నేర్పబడుతుందని, తప్పకుండా 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని పిల్లల తల్లి దండ్రులకు ఆమె అవగాహన కల్పించారు.


జానకంపేటలో అంగన్‌వాడీ బడిబాటపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చదువుకునే పిల్లలను

ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి..

ఎడపల్లి: చదువుకునే పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎడపల్లి గ్రామ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాయిలు అన్నారు. ఈనెల 6వ తేదీనుండి 11 వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎడపల్లి మండల కేంద్రంలో చదువుకుంటున్న విద్యార్థుల, బడి బయటి పిల్లల ఇంటికి వెళ్లి వారి తల్లిదండ్రులతో మాట్లాడి ఇతర పాఠశాలలో చదువుతున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్స్ ఉచిత విద్యతో పాటు మధ్యాహ్న భోజనం అందిస్తూ హెల్త్ క్యాంపులు నిర్వహించడం, శారీరక ఎదుగుదలకు క్రీడల నిర్వహణ చేపట్టడం జరుగుతుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు బోధన్ విద్యార్థులు

బోధన్ రూరల్, జూన్ 7: తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్టేట్ క్రీడా పోటీల ఎంపికలో బోధన్‌కు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారు. మే నెల 31నుంచి జూన్ 1వరకు రెండు రోజుల పాటు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రాజారామ్ స్టేడియంలో అండర్ 8, 10, 12, 14, 16, 18 విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బోధన్‌కు చెందిన ఫిట్‌నెస్ అండ్ అథ్లెటిక్స్ క్లబ్ బోధన్ శిక్షణ సంస్థ విద్యార్థులు స్టేట్ లెవల్ కాంపిటేషన్‌కు అండర్ 8విభాగంలో 50మీటర్ రన్నింగ్ రేసులో శ్రేయన్ష్ ఎంపికవడం జరిగింది. అండర్ 10బాలికల విభాగంలో 80,300 మీటర్స్ రన్నింగ్ రేసులో టీ.మోక్ష, అండర్ 12 బాలుర విభాగంలో 400 మీటర్స్ పరుగు పందెంలో శివ స్నేహిత్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో ఎంపికలో భాగంగా ఈ నెల6న హనుమకొండలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో అండర్ 12 జావాలింగ్ త్రోలో విఘ్నేశ్వర్ రాష్ట్ర స్థాయిలో సిల్వర్ మెడల్‌ను సాధించినట్లు సంస్థ నిర్వాహకులు రెహాన్ తెలిపారు.


క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

'మన ఊరు- మన బడి పనుల బిల్లులు చెల్లించాలి'

నవీపేట, జూన్ 7: గత ప్రభుత్వ హయంలో మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు, మన బడి పేరుతో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను వెంటనే చెల్లించాలని నిజాంపూర్ ఎంపీటీసీ కృష్ణ మోహన్ రావు కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ మోహన్ రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు గత ప్రభుత్వ హయంలో మండలంలోని వివిధ పాఠశాలల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు ఇప్పటికి విడుదల కాలేదని అన్నారు. నవీపేటలోని జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఆట స్థలం కేటాయించాలని మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీలో ఇండ్లపై ఉన్న హైటెన్షన్ వైర్లను తొలగించాలని నవీపేట ఎంపీటీసీ2 మీనా కోరారు. మండలానికి మంజూరైన ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల ప్రస్తుతం నిజామాబాద్‌లో కొనసాగుతుందని వెంటనే సంబంధిత పాఠశాలలను మండల కేంద్రానికి తరలించాలని మోకన్‌పల్లి ఎంపీటీసీ జనార్ధన్ కోరారు. మండలంలో రాత్రిపూట అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయని వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ హరీష్ కుమార్ కోరారు. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అబ్బాపూర్ ఎంపీటీసీ సాయిలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సంగెం శ్రీనివాస్, జడ్పీటీసీ సవిత, వైస్ ఎంపీపీ హరీష్ కుమార్, తహసీల్దార్ నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా ఏర్గట్ల మండల సమావేశం

ఏర్గట్ల, జూన్ 7:మండల కేంద్రంలోని రైతువేదిక శుక్రవారం మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహిం చారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులు పనులపై చదివి వినిపిం చారు. ఎంఈవో ఆంధ్రయ్య మాట్లాడుతూ.. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. అందులో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్‌బుక్‌లు ఇప్పటికే పాఠశాలలకు చేరాయని, ఏకరూప దుస్తువులు మండల సమాఖ్య మహిళా గ్రూప్‌ల ద్వారా సిద్ధం చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, వైస్ ఎంపీపీ లావణ్య, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఆశ్రఫ్, ఎంపీటీసీ మధు సుధన్, తహసీల్దార్ మహమ్మద్ యూసుఫ్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఏపీఎమ్ శ్యామ్, ఎంపీవో శివచరణ్, తదితరులు పాల్గొన్నారు.

చదువే అభివృద్ధికి మలుపు



● మగ్గిడిలో గ్రామస్థులకు ప్రభుత్వ పాఠశాలలో వసతులు వివరిస్తున్న పాఠశాల హెచ్ఎం

మెండోర, జూన్7:చదువు మానవుని జీవిత చరిత్రకు మలుపు లాం టిదని బడీఈడు పిల్లలకు బడిలోనే ఉండాలని బుస్సాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్ అన్నారు. శుక్రవారం బుస్సాపూర్ గ్రామంలో ప్రొఫెసర్ జయ శంకర్ బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు సకల వసతులు కల్పిస్తున్నామని, మధ్యాహ్నభోజన పథకం లాంటి బృహత్తర పథకా లను అమలు చేస్తున్నామని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం బడిబాటకు పెద్దపీట వేసిందని, పిల్లలందరు ప్రభుత్వ పాఠ శాలల్లోనే చదువుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు రాజేశ్వర్, విజయక్ష్మి, అంగన్‌వాడి ఉపాధ్యాయురాలు స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఏర్గట్ల:మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యా యులు బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆరు నుండి 14 సంవత్స రాల పిల్లలను తప్పని సరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ప్రభు త్వ పాఠశాలలో కల్పి స్తున్న వసతులు, పథకాలు, నాణ్యమైన విద్యపై తల్లిదండ్రులకు వివరిం చారు. విద్యార్థులకు ఉచితంగా అందజేసే డ్రెస్సు లు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం వంటి అంశాలపై ఉపాధ్యాయులు వివరించారు .కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు శేర్ల శ్రీనివాస్, కృష్ణప్రసాద్, మురళి, పిట్ల నవీన్‌లు పాలొన్నారు.

ఆర్మూర్‌రూరల్:ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యా యులు ఇంటింటికి తిరిగి బడి బయట పిల్లను గుర్తించి బడిలో చేర్పించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశం నిర్వహించిన సమా వేశంలో ప్రధానో పాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమ విజే తతో పాటు అన్ని వసతులు అందజేస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రైవేటు పాఠశాలలో చేర్పించకుండా ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చాలని కోరారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు మధు, ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

భీమ్‌గల్ రూరల్:ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అధికారులకు సూచన లు చేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం స్కూల్‌లో ఉన్న సౌకర్యాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించాలని ఎంఈవో స్వామి తెలిపారు. 5 సంవత్సరాల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై హరిబాబు, ఏపీఎం రవీందర్, ఐసీడీస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఘన్‌పూర్‌లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యా యులు శుక్రవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని గ్రామస్థులను కలిసి ష్టి చేశారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్‌కి దీటుగా విద్యాను డిజిటల్ తరగతుల ద్వారా అందిస్తున్నమని నాణ్యమైన విద్యను అందజేయడం జరుగుతుందని, ఉచిత భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేయడం జరుగుతుందని, కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఇందుకు గ్రామస్థులు సానుకులంగా స్పందించారని ఉపాధ్యాయులు తెలిపారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని తొర్లికొండ గ్రామంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీలు పనులు చేస్తున్న వద్దకు వెళ్ళి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఎంఈవో శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలు, నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం, ఉదయం రాగిజావా, కంప్యూటర్ విద్య, వివిధ విద్య అంశాలపై ఉపాధి కూలీలకు ఆయన అవగాహన కల్పిస్తూ వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించి చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం జంగం అశోక్, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: మండలంలోని బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఉపాధ్యాయులు, గ్రామస్థాయి అధికారులు ఇంటింటికి సర్వే చేస్తూ ప్రభుత్వ పాఠశాలలో చేరని వారిని గుర్తించి పిల్లలను చేర్పించుకునే కార్యమం నిర్వహించారు. అందులో భాగంగానే ఆయా గ్రామాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి సర్వే నుంచి పిల్లలను గుర్తించి ప్రభుత్వం పాఠశాలలో చేర్పించారు. ఉపాధ్యాయులతో పాటు అంగన్‌వాడీ టీచర్‌లు, ఆశవర్కర్‌లు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా చేపల విక్రయాలు

డొంకేశ్వర్, జూన్ 7: మృగశిర కార్తె మీరుగు సందర్భంగా శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో చేపల విక్రయాలు జోరుగా సాగాయి. రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. రైతులు జోరుగా చేపలు, మామిడిపండ్ల విక్రయాలు సందడిగా మారిన మార్కెట్లు రుతు సంబంధమైన మృగశిరకార్తె (మిరుగు) పండగను మండలంలో ఆయా గ్రామాల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రైతులు వ్యవసాయ పనులను ప్రారంచడానికి జరుపుకునే పండగ కావడంతో అన్నదాతలు మృగశిర ప్రవేశ సమయంలో ప్రకృతి ఆరాధనను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కొన్ని చోట్ల విత్తనాలు వేశారు. మిరుగు రోజు చేపలు, మామిడిపండ్లు తినడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో మార్కెట్‌లో చేపలు, పండ్లకు గిరాకి పెరిగింది. చేపల విక్రయాలు జోరుగా సాగాయి. ఈ ఏడాది చెరువుల్లో నీళ్లు నిండుగా ఉండడంతో గ్రామాల్లోనూ చేపలు పుష్కలంగా లభించాయి.

మెండోర: మృగశిర కార్తె మిరుగు రోజును పురస్కరించుకొని శుక్రవారం మండలంలో చేపల అమ్మకాలను జోరుగా సాగాయి. ఈ సందర్భంగా ప్రతీ ఏడాది మిరుగు రోజు చేపల కూర వండుకోవడం గ్రామాల్లో ఆనవాయితీగా వస్తోంది. దీంతో మత్స్యకారులు గ్రామ ఊరచెరువుల్లో చేపలను పట్టి విక్రయాలు జరిపారు. మెండోర, కోడిచర్ల, బుస్సాపూర్, సావెల్, వెల్కటూర్, దూదిగాం గ్రామాల్లో ప్రజలు చేపలను భారీగా కొనుగోలు చేశారు.

విద్యుత్ షాక్‌తో ఆరేళ్ల చిన్నారి మృతి

ఆర్మూర్‌టౌన్ , జూన్7:ఆలూర్ మండల కేంద్రంలో విద్యుత్ షాక్‌తో సింధూర అనే ఆరేళ్ల చిన్నారి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న సౌందర్య, మనీష్ దంపతులు పనిమీద వెళ్లడంతో.. వారి ఇద్దరు కూతుళ్లను అమ్మమ్మ లావణ్య ఇంట్లో వదిలివెళ్లారు. సాయంత్రం ఇంట్లో ఆడుకుంటూ పిల్లలతో సింధూర కూలర్‌ను తాకడంతో కూలర్‌కు విద్యుత్‌సరఫరా అయి మృతిచెందింది. వెంటనే ప్రైవేటు ఆసు పత్రికి తరలించగా.. అప్పటికే చిన్నారి మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు.

ఆర్మూర్‌లో చిరువ్యాపారులకు తోపుడు బండ్ల వితరణ

ఆర్మూర్‌రూరల్, జూన్7:ఆర్మూర్‌లోని చిరు వ్యాపారులకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో శుక్రవారం తోపుడు బండ్లను వితరణ చేశా రు. రోటరీ పిడి జీ.హన్మంత్‌రెడ్డి తన తండ్రి వెంకటరెడ్డి స్మారకార్థం రూ.లక్ష 60వేల విలువ చేసే తోపుడు బండ్లను సమకూర్చగా వాటిని చిరువ్యాపారులకు అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత్‌రెడ్డి మాట్లా డుతూ జీవనోపాధి కోసం చిరువ్యాపారం చేసుకుంటున్న నిరుపేదలకు సొంతంగా బండి లేని వారికి తమవంతు సహకారం అందించడానికి పది మంది వ్యాపారులకు తోపుడు బండ్లను వితరణ చేశామన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వా రితులసీ, కోశాధికారి లక్ష్మీనారాయణ, కాంతి గంగారెడ్డి, విజయ సారథి, చరణ్‌రెడ్డి,, పద్మ, మురళీ, పుష్పకర్‌రావు, రాజేందర్, రాంప్రసాద్, వినాయక్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

డిచ్‌పల్లి, జూన్ 7:తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో శుక్రవారం ఉదయం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష, మధ్యాహ్నం జరిగిన 1వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. నిజామాబాద్ ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో ఒకరు, ఆర్మూర్ లోని నరేంద్ర పరీక్ష కేంద్రంలో ఒకరు చూచి రాతలకు పాల్పడుతూ డిబార్ అయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ.ఘంటచంద్రశేఖర్ తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని 38పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 6086 అభ్యర్థులకు గాను 5670 మంది హాజరుకాగా 414 విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 3050 మంది విద్యార్థులకు గాను 2840 పరీక్షకు హాజరయ్యారన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● వ్యవసాయాధికారిణి పద్మ



● బాల్కొండ సొసైటీలో ఎరువులను తనిఖీ చేసి ఏవో మహేందర్

మాక్లూర్ , జూన్ 7: రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారిణి పద్మ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్, స్థానిక ఎస్సైలతో కలిసి ఫర్టిలైజర్‌షాప్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తన దుకాణాల్లో రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడే తప్పకుండా రశీదు ఇవ్వాలని ఆమె సూచిం చారు. ఆమె వెంట వ్యవసాయ శాఖ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, తదిత రులున్నారు.

ముప్కాల్,: విత్తనాలు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచాలని మండల వ్యవసాయాధికారి మహేందర్ తెలిపారు. శుక్రవారం బాల్కొండ మండల కేంద్రంలోని విత్తన దుకాణాల్లో తనిఖీ చేశారు. కాంప్లెక్స్ ఎరువులు, యూరియా తగినంత స్టాక్ అందుబాటులో ఉంచుకోవాలని డీలర్‌లకు సూచించారు. ప్రస్తుతం మండలంలోని సొసైటీ ద్వారా 1400బస్తాల యూరియా, 2వేల బస్తాల కాంప్లెక్స్ ఎరువులు ప్రైవేటు దుకాణాల ద్వారా 2200యూరియా, 1100 కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఎరువుల దుకాణదారులు స్టాక్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు పొందుపర్చుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు లైసెన్స్ పొందిన డీలర్ల వద్దను విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. లైసెన్స్ లేకుండా నకిలీ విత్తనాలు రైతులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోర్తాడ్‌లో గూడ్స్ రైలు ఢీకొని యువకుడి మృతి

మోర్తాడ్, జూన్7: మోర్తాడ్ ట్రాక్‌పై గూడ్స్ బండి ఢీకొని పాల్ద సంతోష్ (20) అనే యువకుడు మృతి చెందినట్టు రైల్వే పోలీస్ అధికారి హన్మండ్లు తెలిపారు. మోర్తాడ్‌లోని గోవింద్‌రెడ్డి కాలనీలో నివాసముంటున్న సంతోష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం మృతుడు స్నేహితుడితో కలిసి వస్తుండగా గూడ్స్ బండి ఢీకొట్టింది. దీంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడని ఆయన వెంట తీవ్ర గాయాలతో పడిపోయాడని పోలీసు అధికారులు తెలిపారు. గాయపడ్డ యువకుని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించామని, మృతుని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించామని రైల్వే పోలీస్ అధికారి హన్మండ్లు తెలిపారు.



మృతి చెందిన సంతోష్

కేదారీనాథ్ వెళ్లిన కౌల్‌పూర్ ఆశ్రమం సభ్యులు

నందిపేట, జూన్7:మండల కేంద్రంలోని కౌల్‌పూర్ గ్రామా పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీ పరమహంస శ్రీ భూమయోగేశ్వర ఆశ్రమం నుంచి ఉత్తరఖండ్ రాష్ట్రంలోని బద్రీనాథ్ ఆలయం వరకు చేపట్టిన సభ్యులు శుక్రవారం కేదారీనాథ్‌లోని జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్నారు. ఆశ్రమం సభ్యులు చేపట్టిన పాదయాత్ర 74వ రోజుకు చేరుకుంది. 2024 మార్చి 24న ఆశ్రమం నుంచి వ్యవస్థాపకులు చింత రమేష్ ఆధ్వర్యంలో చేపట్టిన కాలి నడక 1900 కిలో మీటర్లకు సాగా దాటింది. శ్రీ భూమ యోగేశ్వర ఆశ్రమం సభ్యులు గంగోత్రి, యమునోత్రి దర్శనాలు చేసుకొని తిరుగు ప్రయాణం చేస్తామని ఆశ్రమ వ్యవస్థాపకులు చింత రమేష్ తెలిపారు. కార్యక్రమంలో రూపాదేవి, గజ్జెల సత్యనారాయణ, వాల్మీకి నర్సయ్య, రాజేశ్వర్, పార్థసారథి, సత్యం, ఎంబేరు సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న చైర్‌పర్సన్ దంపతులు

ఆర్మూర్‌టౌన్, జూన్7: ఇటీవల మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్ కుటుంబసభ్యులు తిరుపతిలోని వెంకటేశ్వరస్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య దైవదర్శనం నిమిత్తం తిరుపతిలోని వెంకటేశ్వరస్వామిని కుటుంబసమేతంగా వెళ్లి మొక్కులను తీర్చుకుని తలనీలాలను సమర్పించినట్టు ఆమె తెలిపారు.

వేసవి శిక్షణ శిబిరం ముగింపు



చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్, జూన్7 : పట్టణంలోని నటరాజ నృత్యనికేతన్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత నెల రోజుల నుంచి వేసవి సెలవులు చిన్నారుల నాట్య శిక్షణను తీసుకున్న చిన్నారులకు శుక్రవారం రాష్ట్రపతి అవార్డు గ్రహిత మాడవేటి నారాయణ సర్టిఫికెట్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాట్యగురువు బాశెట్టి మృణాళిని, మిమిక్రి కళాకారుడు కోకిల నాగరాజు, చిన్నారులు తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ మొదటి విడత సీట్ల కేటాయింపు పూర్తి

డిచ్‌పల్లి,జూన్7:తెలంగాణ విశ్వ విద్యాలయం పరిధిలోని డిగ్రీకళాశాలలో 2024-25 ప్రవేశాలకు నిర్వహించే దోస్త్ మొదటి విడతలో సీట్ల కేటాయింపు శుక్రవారం పూర్తి అయిందని దోస్త్ కో-ఆర్డినేటర్ సంపత్‌కుమార్ ఒక ప్రకట నలో తెలిపారు.8 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల పరిధిలో 2880 సీట్లకు గాను 212 భర్తీ కాగా,5 అటనమాస్ కళాశాలలో పరిధిలో 4680 సీట్లు ఉండగా 1826 మంది విద్యార్థులు దోస్త్‌ప్రక్రియ ద్వార సీటు సాధించారని ఆయన పేర్కొన్నారు. తెలిపారు. 48ప్రైవేట్ డిగ్రీ కళాశాలల పరిధిలో 22670 సీట్లలో 2608 విద్యార్థులు ప్రవేశం పొందారని దోస్త్ కో-ఆర్డినేటర్ సంపత్ కుమార్ ఈ సందర్భంగా వివరించారు.

బాలురు వాహనాలు నడిపితే జరిమానా

● 10 వాహనాల స్వాధీనం ● సీజ్ చేసిన అధికారులు

జక్రాన్‌పల్లి, జూన్7: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లి గ్రామ పరిధిలోని గాంధీనగర్‌లో ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వివేకా నందరెడ్డి, స్థానిక ఎస్సై సీహెచ్.తిరుపతి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. నెంబర్‌ప్లేట్ లేని వాహనాలను, మైనర్ డ్రైవింగ్ వాహనాల కోసం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించారు. పది వాహనాలను సీజ్ చేసి జరిమానా విధించామని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత నియామలు పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్, ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలన్నారు. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు నడుపుమని ఇవ్వరాదని, ఏమైనా ప్రమాదం జరిగితే తల్లిదండ్రులే బాధ్యత అని, రోడ్డు భద్రత నియామలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జక్రాన్‌పల్లి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను సీజ్ చేసిన అధికారులు



నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం

సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల

నిజాంసాగర్, జూన్7: నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి నిజామాబాద్, బోధన్ పట్టణాలకు తాగునీటి కోసం గతమూడు రోజులుగా నీటి విడుదల కొనసాగుతుంది. ఇందులో భాగంగాప్రాజెక్టులో నీటి మట్టం నిలకడగా ఉందని, 1405 అడుగులకు గాను 1391.14 అడుగులు, 17 టీఎంసీలకు 4.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

పాఠశాలలకు చేరిన పాఠ్యపుస్తకాలు



పుస్తకాలను అందజేస్తున్న జడ్పీటీసీ, ఎంపీపీ

రాజంపేట, జూన్7: రాజంపేట మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి 90శాతం పుస్తకాలు చేరాయని ఎంఈవో రామస్వామి తెలిపారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు జడ్పీటీసీ హనుమండ్లు, ఎంపీపీ స్వరూప చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఈశ్వర్, విజయలక్ష్మీ, సీఆర్పీ లింగం, సాయిరెడ్డి, సూర్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గొర్ల కాపరి మృతి



కృష్ణమూర్తి మృతదేహం

నిజాంసాగర్, జూన్7: మండలంలోని గోరుగల్ గ్రామానికి చెందిన కురుమ కృష్ణమూర్తి (24) అనే గొర్ల కాపరి శుక్రవారం పిడుగు పాటుకు గురై మృతి చెందాడు. కృష్ణమూర్తి రోజులాగే శుక్రవారం కూడా వడ్డేపల్లి శివారులోని నల్లగుట్ట తండా సమీపంలోకి గొర్లకు కాసేందుకు వెళ్లాడు. అయితే సాయంత్రం వేళ ఉరుము మెరుపులతో కూడిన వర్షం పడింది. అదే సమయంలో అక్కడ భారీ పిడుగు పడడంతో. కృష్ణమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానిక రైతులు పోలీసులకు, కృష్ణమూర్తి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని ఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

'హమాలీ రేట్లు పెంచాలి'



అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కామారెడ్డి టౌన్, జూన్7: హమాలీల కూలీరేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న చలో సివిల్ సప్లయి భవన్‌కు పిలుపునిచ్చినట్లు ఏఐటీ యూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజు తెలిపారు. శుక్రవారం సివిల్ సప్లయ్ అ ధికారి భిక్షపతికి వినతి పత్రం అందించారు. హమాలీ రెట్లు ప్రతి రెండు సం వత్సరాలకు పెంచేందుకు గత ప్రభుత్వం జీవో విడుదల చేసిన ప్రకారం జనవరి 1 నుంచి రెట్లు పెంచాల్సి ఉన్న ఇంతవరకు ఎలాంటి పెంపులేదని అ న్నారు. గతంలో సమ్మెనోటీసు ఇస్తే అధికారులు చర్చలు జరిపి రేట్లు పెంచు తామని చెప్పిన రెట్ల పెరుగుదల లేదని దీంతో చలోసివిల్‌సప్లయ్‌భవన్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ్, నాయకులు బాజీ, భీమ్, శేఖర్, భీమయ్య పాల్గొన్నారు.

అటల్ టింకరింగ్ సమ్మర్ బూట్ క్యాంప్ ప్రారంభం

భిక్కనూరు, జూన్7: భిక్కనూరు మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో విజ్ఞాన్ ఆశ్రమ్ పూణే, సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న అటల్ టింకరింగ్ సమ్మర్ బూట్‌క్యాంప్‌ను శుక్రవారం జిల్లాసైన్స్ అధికారి సిద్ధిరాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 9వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. ఈ బూట్ క్యాంప్‌కు మండలంలోని ఆరు పాఠశాలలకు చెందిన 36మంది హజరైనట్లు ఇంచార్జి హెచ్ఎం సుజాత తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ సాయి, వెంకటేష్, రాజు, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షను అధికారులు

సమన్వయంతో నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జూన్ 7: ఈనెల 9న జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతంగా పూర్తిచేసేలా చూడాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం టీఎస్‌పీఎస్సీ పరీక్ష నిర్వహణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్ష కేంద్రాల సమీపంలో అనుమానస్పద వ్యక్తులు, వాహనాలు కనిపిస్తే వాటిని పరిశీలించాలని తెలిపారు. ఈనెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష కొనసాగుతుందని తెలిపారు. ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో ఎంపికచేయాలని అన్నారు. పరీక్ష కేంద్రానికి అభ్యర్థులు ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా ఏదైన గుర్తింపుకార్డు తీసుకురావాలని తెలిపారు. స్ట్రాంగ్‌రూమ్ నుంచి పరీక్ష కేంద్రానికి ప్రశ్నపత్రాలు, తిరిగి పరీక్ష కేంద్రం నుంచి రిసెప్షన్ సెంటర్‌కు తరలించడంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పరీక్షాకేంద్రంలో చీఫ్ సూపరిటెండెంట్ తప్ప ఎవరూ సెల్ ఫోన్ వాడవద్దని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథరావు, కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ పాఠశాల తరగతి గది సీజ్



తరగతి గదిని సీజ్‌చేస్తున్న విద్యాశాఖ సిబ్బంది

కామారెడ్డి టౌన్, జూన్7: కాకతీయ పాఠశాల వేసవిలో సైతం 10వ తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నారని ఏబీవీపీ నాయకులు తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలను పరిశీలించి విద్యాశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో విద్యాశాఖ సిబ్బంది పాఠశాల తరగతి గదితోపాటు పుస్తకాలు, స్కూల్‌యూనిఫాం అమ్ముతున్న గదిని సీజ్‌చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు చరణ్, ఖలీల్, రోహిత్ ఉన్నారు.

రాజంపేట ఎస్సైపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు

రాజంపేట, జూన్7: ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాజంపేట ఎస్సైపై ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి దృష్టికి బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పట్టిం చుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నాడని, సమస్య ఉందని పోలీసు స్టేషన్‌కు వెళ్లిన సమస్యను పరిష్కరించకుండా వాయిదా వేస్తున్నారని మండల ప్రజలు తమ దృష్టికి తీసుకురావడంతో ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో 70మంది బీజేపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



బరంగేడ్గిలో పిల్లల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బీర్కూర్, జూన్7: బీర్కూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బడిబాట కార్యక్రమం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం మండలంలోని దామరంచన, చించోల్లి, కిష్టాపూర్, బీర్కూర్, బరంగేడ్గి తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు పర్యటించారు. విద్యార్థుల తల్లిండ్రులతో మాట్లాడారు. తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉచితంగా యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని చెప్పారు. బడిబయట పిల్లలతోపాటు విద్యార్థి దశ పిల్లలను గురించి పాఠశాలలో చేర్పిస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తమ పాఠశాలలో చేర్పించాలని చక్కటి విద్యను అందిస్తామని హామీనిచ్చారు.

ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన

మద్నూర్: ఉమ్మడి మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనలో భాగంగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా శుక్రవారం మద్నూర్ మండలకేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు ఇంటింటికి వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి వారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు సాధించిన ప్రగతి, పాఠశాలలో సదుపాయాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మారుతి, శేఖర్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

బడిబాట ఆచరణలో విఫలం!

మద్నూర్, జూన్7: బడిబాట ద్వారా సాధారణ విద్యార్థులతోపాటు బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలి. కానీ ఉమ్మడి మద్నూర్ మండలవ్యాప్తంగా బడి ఈడు పిల్లలు చాలామంది కార్మికులుగా మారుతున్నారు. ఉమ్మడి మద్నూర్ మండలంలోని మద్నూర్, డోంగ్లీ మండలాల్లో ఇటుకల తయారీ వద్ద, హోటల్‌లలో, ఇళ్లల్లో పనిచేసేవారు ఎక్కువగా కనిపిస్తున్నారు. బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించడమే లక్ష్యం బడిబాట కార్యక్రమం చేపడుతున్న ఆచరణలో మాత్రం నెరవేరడం లేదు. ఈఏడాది అయినా బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించి, బడి బయట ఉన్న పిల్లందరినీ పాఠశాలల్లో చేర్పించాలని ప్రజలు కోరుతున్నారు.

విత్తన దుకాణాల్లో తనిఖీలు



భిక్కనూరులో రిజిష్టర్లను పరిశీలిస్తున్న అధికారులు



రికార్డులను పరిశీలిస్తున్న ఏవో

భిక్కనూరు, జూన్ 7: విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు సంబంధిత దుకాణ యాజమాని రశీదు తప్పక ఇవ్వాలని ఏడీఏ అపర్ణ సూచించారు. శుక్రవారం భిక్కనూరు మండలకేంద్రంలోని విత్తనాల దుకాణాలను ఏడీఏ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ప్రతీ విత్తనాల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ తప్పక నిర్వహించాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. ఇవరైనా కాలం చెల్లిన, నకిలీ విత్తనాలను విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. రైతులు సైతం విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రాధా, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మొద్దు

రామారెడ్డి: మండల కేంద్రంలోని విత్తనాల దుకాణాలను శుక్రవారం ఏవో ప్రజాపతి పరిశీలించారు. విత్తనాలను అమ్మిన రికార్డులను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే డీలర్లపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. వ్యవసాయానికి సంబంధించిన మందులను మాత్రమే అమ్మకాలు జరపాలని గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెలు తదితర వాటికి మందులు అమ్మరాదని తెలిపారు. వ్యవసాయాధికారుల సలహా మేరకే రైతులు పంటలు వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు రాకేష్, రాజు పాల్గొన్నారు.

తాడ్వాయిలో ఘనంగా బోనాల పండుగ

తాడ్వాయి, జూన్7: మండల కేంద్రంలో శుక్రవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలను గ్రామదేవతలకు సమర్పించి వర్షాలు బాగా కురువాలని, పంటలు బాగా పండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

నేడు మృగశిర కార్తె

● ప్రారంభం కానున్న వ్యవసాయ పనులు

మద్నూర్, జూన్7: వర్షాకాలానికి నాంది పలికే మృగశిర కార్తె శనివారం నుంచి ప్రారంభం కానుంది. కార్తెను గ్రామీణ ప్రాంత ప్రజలు మిరుగు కార్తె అంటారు. జూన్ మొదటి వారంలో వచ్చే ఈ కార్తె వ్యవసాయ పనులకు రైతులు శ్రీకారం చుట్టానున్నారు. ఇన్నాళ్లూ వేసవి తాపంతో ఇబ్బందులు పడ్డ జనం ఈ కార్తెలో కురిసే తొలకరి జల్లులతో ఉపశమనం పొందుతారు. కార్తె రోజు ప్రత్యేక వంటకాలను చేసుకుని ఆరగిస్తారు. మాంసాహారులు విధిగా చేపలు, కోడి మాంసం ప్రత్యేకంగా చేపలు తినేందుకు మొగ్గు చూపుతారు. వేసవికాలం ముగిసే వర్షాకాలంలో వచ్చే చలిని తట్టుకునేందుకు విధిగా చేపలు, కోడి మాంసం తింటామని పలువురు చెబుతారు. శాఖహారులు తీపి వంటకాలు తినడంలోపాటు బెల్లం వేడిని పెంచే ఇంగువ గుళికలుగా చేసుకుని మింగుతారు. ఈరోజు ప్రజలు మిరగం పండుగగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. మృగశిర కార్తె రోజు చేపలు తినాలనేది సాంప్రదాయం. దీంతో అన్ని తరగతుల ప్రజలు తమతమ స్థోమతకు తగినట్లుగా చేపలు కొనుగోలు చేయడంతో చేపలకు డిమాండ్ పెరిగింది. దీంతో వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచారని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



బోరు బావుల వద్దనాట్లువేసేందుకు సిద్ధం చేస్తున్న సాగు భూమి

బోరుబావుల వద్ద వరినాట్లు సిద్ధం

● నిజాంసాగర్ నాన్‌కమాండ్ ఏరియాలో ఏపుగా పెరిగిన వరి నారుమళ్లు

నిజాంసాగర్, జూన్ 7: ఉభయ జిల్లాల వర ప్రదాయిని నిజాంసాగర్ ప్రాజెక్టు నాన్‌కమాండ్ ఏరియాలో బోరుబావుల వద్ద రైతులు వరినాట్లకు సమాయత్తం అయ్యారు. మృగశిర కార్తే ప్రారంభం కావడంతో ముందస్తుగానే నాన్ కమాండ్ ఏరియాలో వరి నారు మళ్ల వేసినాట్లకు సిద్ధం చేసుకున్నారు. మాగి, గోర్గల్, మల్లూర్, వడ్డేపల్లి, జక్కాపూర్, మల్లూర్ తాండ, నిజాంసాగర్ గ్రామాల్లో బోరు బావుల వద్ద గత 20 రోజుల క్రితమే వరి నారు మళ్ల పోశారు. ప్రాజెక్టులో వర్షాకాలానికి సరిపడా నీరు ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదు. కేవలం మంజీరా పైనే ఆధార పడటంతో పాటు బోరు బావుల కింద వరి నాట్లువేసేందుకు దుక్కులు సిదం చేసి, నీరు పారిస్తూ వరి నాట్లకు సిద్ధం అవుతున్నారు. యాసంగిలో రైతులు అధిక దిగుబడి సాధించడంతో ఈ యేడాది వర్షాకాలంలో దిగుబడి పెంచే వరి వంగడాలనే ఎంచుకున్నారు. ప్రతీ రైతు వర్షాకాలంలో అరుదైన విత్తనాలనే ఎంచుకుని దిగుబడి సాధించేందుకు సమాయత్తం అవుతున్నారు. నాన్ కమాండ్ ఏరియాలో మరో వారంలో వేసేందుకు సిద్ధమయ్యారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలకిషన్

ఎల్లారెడ్డి, జూన్7: ఆర్యవైశ్య సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాలకిషన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కైలాస్ శ్రీనివాస్, చంద్రపాల్ ప్రకటించారు. శుక్రవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వైశ్య భవన్‌లో అధ్యక్ష పదవికి నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. అందులో కంచర్ల బాలకిషన్ ఒక నామినేషన్ దాఖలు కావడంతో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అధ్యక్షునిగా నియామక పత్రాన్ని ఈనెల 9న రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో అందించనున్నట్లు తెలిపారు.

ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

● ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

భిక్కనూరు, జూన్7: ప్రతీఒక్కరు తమ ఇంటి పరిసరాలన శుభ్రంగా ఉంచుకోవాలని భిక్కనూరు ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. శుక్రవారం భిక్కనూరు గ్రామపంచాయితీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా ప్రతిఒక్కరు పరిసరాలను ఎల్లప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, మురికికాలువల్లో ప్లాస్టిక్, వ్యర్థాలను వేయవద్దన్నారు. గ్రామపాంచియతీ సిబ్బంది ప్రతీ గ్రామంలో మురికి కాలు వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఈవో మోహన్‌గౌడ్, సిబ్బంది పాల్గొన్నారు.

'గోవధను నిర్మూలించాలి'

కామారెడ్డి టౌన్, జూన్ 7: అక్రమంగా తరలిస్తున్న గోవులను రక్షించడంతో పాటు గోవధను నిర్మూలించాలని కోరుతూ గోసంరక్షణసమితి, విశ్వహిందూ పరిషత్ నాయకులు శుక్రవారం ఎస్పీసింధూశర్మతో పాటు కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు పవిత్రంగా భావించే గోవులను కొందరు అక్రమంగా తరలిస్తూ వాటిని చంపివేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోసంరక్షక నాయకులు రాజు, విశ్వహిందూపరిషత్ నాయకులు రాజు, వెంకటస్వామి, ప్రసాద్, అశోక్,విశ్వనాథం, బీజేపీ నాయకులు తదితరులున్నారు.



ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి	
దర్శన్	గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి
శాంతి	గమ్‌గమ్ గణేషా
ప్రియా 70	బజే వాయు వేగం
ప్రియా 35	లవ్ మీ ఇఫ్‌యూ డేర్

బాన్సువాడ	
మహేశ్వరి	భజే వాయు వేగం
వెంకటేశ్వర	గం గం గణేశా

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	151	219	249
వెన్‌కాబ్(కిలో)	162	222	260

